

12 కోట్ల ఇళ్లకు వంటగ్యాస్

దేశవ్యాప్తంగా 12 కోట్ల గృహాలకు పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తామన్నారు.

వివరాలు 8లో ▸



మూడోస్థానం

జడ్చర్లలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ టోర్నీలో పాలమూరు మూడోస్థానంలో నిలిచింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.2 /16.0

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

4 నుంచి ఓపెన్ డిగ్రీ ప్రయోగ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ 5కు సంబంధించిన ప్రయోగ పరీక్షలు మార్చి 4వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు పరీక్షకు చెల్లించిన ఫీజుల రసీదు, ఐడెంటీకార్డుతో స్టడీ సెంటర్‌లో పరీక్షల టైంటేబుల్ తెలుసుకోవాలని సూచించారు. 80 శాతం హాజరులేనిదే పరీక్షలకు అనుమతి ఉండదని, మరింత సమాచారం కోసం 73829 29609 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి మన్యంకొండలో పద్య నాటకాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యం, మన్యంకొండ దేవస్థానం సహకారంతో శుక్రవారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, వి.నారాయణ తెలిపారు. జిల్లాకేంద్రంలో గురువారం పద్య నాటకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తొమ్మిదేళ్లుగా పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు శాస్త్రీయ నృత్య ప్రదర్శన, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, శ్రీకృష్ణరాయబారం నాటకం, కౌరవసభ, కర్ణ రహస్యం, దేవేంద్రసభ, 2వ తేదీన శ్రీకృష్ణరాయబారం, మైరావణ పూర్తి నాటకం, మాయల పకీరు ఏకపాత్రాభినయం, గయోపాఖ్యాన యుద్ధం, 3వ తేదీన శ్రీరామంజనేయ యుద్ధఘట్టం, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, గురుశిష్యుల సంవాదం, 4వ తేదీన భజనలు, చిన్నారులచే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీమిత్రకళానాట్య మండలి కార్యనిర్వాహక కార్యదర్శులు నర్సింలు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద ఉపకారం వేతనం పొందేందుకు అర్హతగల మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎంకే.రవీంద్రనాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగస్టు 1, 2023 నుంచి డిసెంబర్ 31 2023 వరకు విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొంది ఉంటే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో ఐడీ, స్టడీ, కుల, ఇతర సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, దరఖాస్తు చేసిన తర్వాత హార్డ్‌కాపీలు, అవసరమయ్యే సర్టిఫికెట్లను ఐడీఓసీ బిల్డింగ్‌లో గల జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో ఏప్రిల్ 15లోగా అందజేయాలని సూచించారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

- పీఆర్ ఈసీ శివకుమార్



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈసీ శివకుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జెడ్పీహాల్‌లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఏఈఈలు, డీఈఈలు, ఈఈలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం నిధుల నుంచి జిల్లాలో చేపడుతున్న సీసీ రోడ్లు పూర్తి చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే బిల్లులు చేసిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి దాక టెండర్లు కాని పనులను గుర్తించి వెంటనే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో పాటు ఇంకా ప్రారంభం కాని పనులను గుర్తించాలని, గుర్తించిన వాటి పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. ఇప్పటికే మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



జిల్లాల వారీగా ఖాళీల వివరాలు

జిల్లా	ఎస్‌ఏ	పండిట్	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు
నారాయణపేట	73	23	1	161	21
నాగర్‌కర్నూల్	70	18	2	141	54
వనపర్తి	57	9	6	56	24
మహబూబ్‌నగర్	38	24	8	146	27
జోగుళాంబ గద్వాల	35	28	8	80	21
మొత్తం	273	102	25	584	147

కొలువుల జాతర

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- గత ఏడాది కంటే 'రెట్టింపు' పోస్టులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి పాలమూరు పరిధిలో టీచర్‌పోస్టుల ఖాళీలు మొత్తం 1,131
- అత్యధికంగా నాగర్‌కర్నూల్‌లో 285, అత్యల్పంగా వనపర్తిలో 152 పోస్టులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నిరుద్యోగ యవత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ ప్రకటనను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు సైతం స్వీకరించినా.. పరీక్ష తేదీలను ప్రకటించలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రకటించిన పోస్టులకు మరిన్ని జోడించి కొత్త నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసింది. అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని సూచించింది. ఈనెల 4 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.

■ గత ప్రభుత్వం ఎన్నికల ముందు సెప్టెంబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో 586 ఖాళీలు ఉండగా.. అందులో ఎస్‌ఏలు 232, ఎస్జీటీలు 241 పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఒక్కో జిల్లాకు కొన్ని విభాగాల్లో 2, 3, 4 పోస్టులు మాత్రమే ఉండటంతో నిరుద్యోగ యువత నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రస్తుత ప్రభుత్వం పోస్టులసంఖ్య 1,131కి పెంచి ప్రకటన విడుదల చేసింది. ఎస్‌ఏలు 273, పండిట్‌లు 102, పీఈటీలు 25, ఎస్జీటీలు 584, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు 147 పోస్టులు ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 172, మహబూబ్‌నగర్‌లో 243, నాగర్‌కర్నూల్ జిల్లాలో 285, నారాయణపేటలో 279, వనపర్తి జిల్లాలో 152 పోస్టులు ఉన్నాయి.

దరఖాస్తులకు అవకాశం..

మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది ప్రభుత్వం. ప్రతి పోస్టుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహణకు సంబంధించిన అంశాలను త్వరలో వెల్లడించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పరీక్ష సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్) విధానంలో నిర్వహించనున్నారు.

శుభపరిణామం



ఎన్నో ఏళ్లుగా విద్యాశాఖలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై నెలకొన్న నీలినీడలు తొలగిపోవడం శుభపరిణామం. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం కారణంగా విద్యా వ్యవస్థ తిరోగమనంలో నడిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. ఇప్పుడు భర్తీచేసిన పోస్టులతో పాటు రాష్ట్రంలో నెలకొన్న పూర్తిస్థాయి టీచర్ ఖాళీలను మరో డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. పదోన్నతులు, బదిలీలను కల్పిస్తూ విద్యాశాఖలో పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేసి విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.

– నరహరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సెక్రెటరీ, నారాయణపేట

మళ్లీ తక్కువ పోస్టులే..



డీఎస్సీ నోటిఫికేషన్‌లో గద్వాల జిల్లాకు పోస్టులు తక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఉన్న పోస్టులకు, ప్రస్తుత నోటిఫికేషన్‌లోని పోస్టుల సంఖ్యలో పెద్దగా తేడా లేదు. తక్కువ పోస్టులున్నా ఉద్యోగమే లక్ష్యంగా చదువుతున్నాను. గతంలో డీఎస్సీ రాశాను. అప్పుడు కొద్ది మార్కుల తేడాతో కొలువు సాధించలేకపోయాను.

– జయన్న, డీఎస్సీ అభ్యర్థి, గద్వాల

మెగా డీఎస్సీ పేరుతో మోసం



గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయలేదని గగ్గొలు పెట్టి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ వేస్తామని నమ్మించి మోసం చేశారు. రాష్ట్రంలో 26వేల టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పిన హస్తం పార్టీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 11 వేలతో సరిపెట్టడం ఎంత వరకు సమంజసం. రాజకీయ లబ్ధి కోసం నోటికి వచ్చిన హామీలు ఇచ్చి మోసం చేయడం అన్యాయం. ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని ఆన్‌లైన్ పద్ధతికి నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదు.

– నవజ్యోతి, నిరుద్యోగి, బండగొండ, నారాయణపేట జిల్లా

పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భారత్ ప్రపంచంలో అతిపెద్ద పార్లమెంటరీ వ్యవస్థ కలిగి ఉందని, దానిపైనే సమాజంలోని ప్రతి వ్యక్తి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రవినాయక్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ యువజన శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటరీ వ్యవహారాలు, శాసన నిర్మాణ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన అవసరం అన్నారు. వినూత్నమైన భారత్ ఆవిష్కరించాలంటే ప్రజాస్వామ్య వ్యవస్థతోనే సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్‌లను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జిల్లా యువజన అధికారి కోటానాయక్, అధ్యాపకులు గంగాధర్, ముంతాజ్ జహాన్, లావణ్య, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల్లో మార్పుతోనే ప్రమాదాల కట్టడి



2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

- ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి: ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ క్రైం: దేశవ్యాప్తంగా నిత్యం ఎన్నో రకాల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి నిమిషానికి ఒకరు చొప్పున చనిపోతున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 2కే రన్ కార్యక్రమాన్ని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వాహనదారులకు రోడ్డు భద్రత, ప్రమాదాలపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు తెలుసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు డ్రైవింగ్ చేసే వారు తప్పకుండా సీటు బెల్టు ధరించాలని, వాహనాదారులలో మార్పు వచ్చినప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. రోడ్లపై వాహనాల రద్దీ పెరుగుతున్న క్రమంలో దానిని దృష్టిలో పెట్టుకుని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్‌లో వాహనం నడపరాదని, పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్క్ చేయాలని, రోడ్లపై అడ్డదిడ్డంగా పార్క్ చేయరాదన్నారు. జరిమానాలు విధించడం పోలీస్ ఉద్దేశం కాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి మాత్రమే జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యుడు

సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేసి ఎలా రక్షించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యుడి ఆధ్వర్యంలో ప్రత్యేక బొమ్మ ద్వారా సీపీఆర్ చేసే విధానాన్ని పోలీస్ సిబ్బందికి చూపించారు. అనంతరం ఇటీవల పలువురికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన పోలీస్ కానిస్టేబుల్స్ రామ్ గోవర్ధన్, వెంకట్‌కుమార్, రఘు, శివలకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్, ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

208 మంది గైర్హాజరు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు 33 పరీక్ష కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా జరిగాయి. రెండో సంవత్సరం విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు రాశారు. ఈ మేరకు మొత్తం 9,852 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 9,644 మంది హాజరయ్యారు. 208 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ బోర్డు అధికారులు జడ్చర్లలోని పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. డీఐఈఓ శ్రీధర్‌సుమన్, స్క్వాడ్ అధికారులు జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరిగాయని డీఐఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక్ స్కూల్స్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్సీఓ ఫ్లారెన్స్‌రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు మార్చి 1వ తేదీ(శుక్రవారం) వరకు అవకాశం ఉందని, మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇంటింటికి వెళ్లి కేంద్ర పథకాలు వివరించాలి

పాలమూరు: పదేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసి అభివృద్ధికి పాటుపడ్డారని, ఈ విషయాన్ని ప్రతి కార్యకర్త ఇంటింటికీ చేరవేసే విధంగా చొరవ తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి మండల పరిధిలో ఉన్న ప్రతి గ్రామానికి వెళ్లి కేంద్ర పథకాలతో పాటు మోదీ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఏపీ మిథున్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, బుడ్డన్న, కిరణ్ కుమార్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద వడ్డీలో 90శాతం రాయితీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 2022–23 వరకు ఉన్న ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీని 90 శాతం మాఫీ చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ జె.పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డీ మాఫీ కోసం ఏక మొత్తం పరిష్కార (వన్‌టైమ్ సెటిల్‌మెంట్) పథకాన్ని అమలు పరుస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2023 ఆర్థిక సంవత్సర బకాయిలను వడ్డీతో సహా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎవరైనా చెల్లించిన పక్షంలో ఆ 90 శాతం వడ్డీ రాయితీ మొత్తాన్ని తర్వాత సంవత్సరం చెల్లించాల్సిన ఆస్తిపన్నులో సర్దుబాటు చేస్తామన్నారు. మార్చి 31లోగా ఆస్తిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎంపీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి
- 6న పాలమూరులో సీఎం రేవంత్‌సభ: డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్
- నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో రిజర్వాయర్ల సందర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థాయి మండల పార్టీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.రానున్న ఎంపీ ఎన్నికల దృష్ట్యా ఈ రెండు, మూడు నెలలు చాలా కీలకమైని నాయకులు, కార్యకర్తలు మండలాలు, గ్రామాల్లోనే ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్‌స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఓటమిని తట్టుకోలేక ప్రజలను మభ్యపెట్టడానికి చలో మేడిగడ్డ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు హడావిడి చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కంటే మొదలెట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు రూ.28వేల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్లు పారించలేదన్నారు. పనులు పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కర్వెన, ఉదండాపూర్, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లను సందర్శిస్తున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఈనెల 6వ తేదీన తొలిసారి జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. 50 వేల మందితో జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు శివకుమార్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు చేయూత

- 'పీఎం విశ్వకర్మ' ద్వారా రుణాలు
- 3 పట్టణాల్లో 2,081 దరఖాస్తులు రాక
- 219 పరిశీలన పూర్తి, మరో 16 రిజెక్ట్
- ఇంకా తనిఖీ చేయాల్సినవి 1,846

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చేతి వృత్తిదారుల కోసం కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో 'పీఎం విశ్వకర్మ'ను ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 18 రకాల పనులు చేసేవారిని ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించింది. వీరికి రెండు విడతలుగా బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తారు. దీనికి వడ్రంగి, పడవ తయారీ, ఇనుపకడ్డీలు, సుత్తి, తాళాలు, బంగారం, కుండలు, మట్టిపని, శిల్పి, లెదర్ (చెప్పులు), తాపీమేస్త్రీ, బుట్టలు చేసే, బొమ్మలు, మంగలి, దండలు, చాకలి, టైలర్ పని, చేపలవల తయారుచేసే వారు అర్హులు. పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులుగా ఎంపికైన వారికి మెప్మా ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి మొదటి విడత లో ఐదు శాతం వడ్డీతో రూ.లక్ష చొప్పున రుణ ం ఇస్తారు. 18 నెలల్లో రుణ బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. క్రమం తప్పకుండా గడువులోగా పూర్తి చేస్తే ఆ తర్వాత రెండో విడతలో రూ.రెండు లక్షలు ఇస్తారు. దీనికి గాను 30 నెలల పాటు కంతులు చెల్లించాల్సి ఉంటుంది.

3 పట్టణాల్లో వచ్చిన దరఖాస్తులు

పీఎం విశ్వకర్మ పథకానికి గాను ఐదు నెలల్లో మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 2007 మంది చేతివృత్తిదారులు, జడ్చర్ల పట్టణం నుంచి 32మంది, భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో 42 మంది ఇలా మొత్తం 2,081 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మహబూబ్‌నగర్ పట్టణంలో 188 మంది, జడ్చర్లలో 16 మంది, భూత్పూర్ పట్టణంలో 15 మంది దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ఇంకా మహబూబ్‌నగర్‌లో 1,819 మంది, భూత్పూర్‌లో 27 మంది దరఖాస్తులను క్షేత్రస్థాయిలో మెప్మా అధికారులు పరిశీలించాల్సి ఉంది. కేవలం జడ్చర్లలో వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో సగం మంది మాత్రమే అర్హులుగా తేల్చారు.



మహబూబ్‌నగర్‌లో వెల్డింగ్ షాపు వద్ద దరఖాస్తుదారు వివరాలను పరిశీలిస్తున్న మెప్మా సిబ్బంది



ప్రేమ్‌నగర్‌లో ఓ టైలరింగ్ షాపులో దరఖాస్తుదారు వివరాలను పరిశీలిస్తున్న మెప్మా సిబ్బంది (ఫైల్)

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. చేతి వృత్తిదారులకు రెండు విడతలుగా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తాం. ఎంపికైన వారి ఖాతాలోనే డబ్బులు జమ అవుతాయి. తక్కువ వడ్డీకి లభించే ఈ ఆర్థికసాయం లబ్ధిదారులకు ఎంతో చేయూతనిస్తుంది. ఇది నిరంతర ప్రక్రియ. ఇంత వరకు దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా నమోదు చేసుకోవచ్చు.

– శివకుమార్‌గౌడ్, డీఎంసీ, మెప్మా, మహబూబ్‌నగర్

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

మొదట ఆయా చేతివృత్తిదారులు తమ పూర్తి వివరాలతో మీ–సేవ లేదా సీఎస్‌సీ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం మెప్మా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీ చేసి అర్హులను గుర్తించి జిల్లాస్థాయి కమిటీకి నివేదిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి, ఆ తర్వాత జాతీయస్థాయి కమిటీకి పంపిస్తారు. చివరగా అర్హుల బ్యాంకు ఖాతాకు నేరుగా రుణం డబ్బులు జమ చేస్తారు.

క్లుప్తంగా

గొంతులో కోడిగుడ్డు ఇరుక్కొని వ్యక్తి మృతి


తిరుపతయ్య(ఫైల్)

మదనాపురం: గడ్డుబజ్జి తింటుండగా.. గొంతులో గుడ్డు ఇరుక్కొని ఊపిరాడక ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మదనాపురం మండలంలోని గోవిందహళ్లికి చెందిన దాసరి తెలుగు తిరుపతయ్య (39)అనే మత్స్య కార్మికుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన ఇంటివద్ద కూర్చొని గుడ్డు బజ్జి తింటున్న క్రమంలో అది గొందులో ఇరుక్కుపోయింది. దీంతో ఆయన నేలపై పడిపోవడంతో వెంటనే భార్య సువర్ణ గమనించి గొంతులో ఉన్న గుడ్డుబజ్జిని తీసేందుకు ప్రయత్నించారు. బయటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిపించి.. గొంతులో ఉన్న గుడ్డును బయటికి తీశారు. అప్పటికే ఊపిరాడక మరణించాడు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు పంచానామా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా.. పదేళ్ల క్రితం ఇదే గ్రామంలో గొల్ల తిరుపతయ్య యాదవ్ కూండా ఉడకబెట్టిన కోడిగుడ్డు గొంతులో ఇరుక్కొని మృతి చెందాడు.

నిద్రలోనే మృత్యుఒడిలోకి..


దామిని(ఫైల్)

గోపాల్‌పేట: అభం శుభం తెలియని ఓ చిన్నారి నిద్రలోనే మృత్యుఒడికి చేరింది. ఈ హృదయ విదారక ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన క్యాత్రమోని రమేష్, శారదలు నాలుగేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి రెండేళ్ల పాప దామిని ఉంది. చిన్నారిని నాయనమ్మ ఇంట్లో ఉంచి తల్లిదండ్రులు వలస వెళ్లారు. బుధవారం రాత్రి చిన్నారి భోజనం చేసి నిద్రించింది. గురువారం తెల్లవారుజామున చిన్నారి దామినిని నాయనమ్మ చూడగా ముక్కులో నుంచి రక్తస్రావం అయ్యి అచేతన స్థితిలో మృతిచెందినట్లు కనిపించింది. విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు గ్రామానికి చేరుకొని బోరున విలపించారు. ఈ ఘటనపై గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా వారికి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మిడ్జిల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అయ్యవారిపల్లికి చెందిన పురం బంగారు(38) గురువారం ఉదయం గ్రామ సమీపంలోని చిల్వేర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి పొలం దగ్గర స్ప్రింక్లర్ మార్చుటకు కూలీ పనికి వెళ్లాడు. సాయంత్రం పొలం సమీపంలో అనుమానాస్పద స్థితిలో పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చేలోపు అతను మృతి చెందాడు. ఆయన భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అస్రత్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

వెల్దండ: మండల పరిధిలోని నగారగడ్డతండా సమీపంలో బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపు తప్పి జగదేవ్‌పూరి(37) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జగదేవ్‌పూరి కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్‌లో చీమర్ల వెంకటయ్య వ్యవసాయంలో కూలీ పనులు చేస్తూ.. జీవిస్తున్నాడు. బుధవారం సొంత పని నిమిత్తం బైక్‌పై వెల్దండకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. నగారగడ్డతండా సమీపంలో రోడ్డు పక్కల బుధవారం రాత్రి బైక్ అదుపు తప్పి పడిపోయాడు. రాత్రి సమయంలో ఎవ్వరూ చూడలేదు. గురువారం రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

దాడి కేసులో రెండేళ్ల జైలు శిక్ష

గద్వాల క్రైం: దాడి చేసిన ముగ్గురు వ్యక్తులకు శిక్ష విధిస్తూ గద్వాల కోర్టు తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ రితిరాజ్ గురువారం ప్రకటనలో తెలిపారు. గట్టు మండల కేంద్రంలోని గూడూరు నాగరాజుకు చెందిన వ్యవసాయ పొలంలో అదే మండలానికి చెందిన సరాబాయ్ కృష్ణ, సరాబాయ్ మూకన్నలు సదరు వ్యక్తి పొలంలో ట్రాక్టర్ ద్వారా చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న యజమాని పనులు నిలిపేయాలని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో అకారణంగా సరాబాయ్ కృష్ణ, చిన్న మూకన్న, పెద్ద మూకన్న, గుండన్న గూడూరు నాగరాజుపై దాడికి పాల్పడ్డారు. 2016లో కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం సాక్షుల వాంగ్మూలం అనంతరం జడ్జి నిందితులకు రెండేళ్ల రెండు నెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఇదే కేసులో చిన్న మూకన్నకు రెండు నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా, ఏ1, ఏ3, ఏ4లకు రూ.500 జరిమానా విధించారు.

మరుపురాని రోజు


మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఉన్న శిశువులు

- ఫిబ్రవరి 29న మహబూబ్‌నగర్ వ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో 35 మంది శిశువులు జననం
- మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో 23 మంది..

సాక్షి, నెట్‌వర్క్: సాధారణంగా పుట్టిన రోజు అంటే ఏడాదికి ఒక్కసారి వస్తోంది. కానీ లీపు సంవత్సరం అంటే ఫిబ్రవరి 29న జన్మించిన వారికి మాత్రం ప్రతి నాలుగు ఏళ్లకు ఒక్కసారి పుట్టిన రోజు వస్తోంది. ప్రతి నాలుగు ఏళ్లకు ఓసారి వచ్చే ఈ వేడుకను చాలా మంది ప్రత్యేకంగా నిర్వహిస్తారు. చెప్పుకోవడానికి కొంత ఆశ్చర్యంగా ఉంటుంది. ఈసారి కూడా లీపు డే సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 35మంది శిశువులు జన్మించారు. దీంట్లో జిల్లా జనరల్ ఆస్పత్రిలో మధ్యారాత్రి 12గంటల నుంచి గురువారం రాత్రి 8గంటల వరకు 23 మంది శిశువులు జన్మించగా, దీంట్లో 12 మంది ఆడ శిశువులు, 11మంది మగ శిశువులు ఉన్నారు. జడ్చర్లలో రెండు, పీహెచ్‌సీలలో ఆరు ప్రసవాలు అయ్యాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో నలుగురు ప్రసవించారు.


మహబూబ్‌నగర్‌లో గురువారం పుట్టిన శిశువులతో తల్లులు


శిశువుతో వసంత


చిన్నారితో తిరుపతమ్మ

‘పేట’లో ఏడు ప్రసవాలు: ఎనిమిది మంది పిల్లలు

నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో గురువారం ఏడు ప్రసవాలు జరిగాయి. ఇందులో ముగ్గురు మగబిడ్డలు ఉండగా ఐదుగురు ఆడబిడ్డలు ఉన్నారు. కాగా ఒకరు కవలలు పుట్టినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ తెలిపారు.

అరుదైన రోజు..

ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకుని ప్రత్యేక రోజు కోసం మరో నాలుగేళ్లు వేచి ఉంటాం. అందాక నాలుగేళ్లు సరిపడ ఆనందం పొందుతామంటూ నవాబుపేటకు చెందిన ఊరకొండ విశ్వనేత్రాచారి, స్నేహశ్రీల వివాహం జరిగింది. కాగా పెళ్లి మండపంలో వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా ఉన్న దంపతులకు అందరూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.


అరుంధతీ నక్షత్రం వధువుకు చూపిస్తున్న వరుడు

పెళ్లి రోజు స్పెషల్ ఉండాలని..


ఎక్లాస్‌పూర్‌లో వధూవరులను ఆశీర్వదిస్తున్న స్నేహితులు

తమ పెళ్లి రోజు అందరిలా కాకుండా స్పెషల్‌గా ఉండాలనే ఆలోచనతో ఫిబ్రవరి 29కి పెళ్లి చేసుకున్నాం. బంధువులు, స్నేహితులు లీపు ఇయర్ పెళ్లి దంపతులు అంటూ శుభాకాంక్షలు తెలుపుతుంటే ఆ ఆనందం మాటల్లో చెప్పలేనంతగా ఉందని నూతన దంపతులు చెప్పుకొస్తున్నారు. మరికల్ మండలం ఎక్లాస్‌పూర్ చెందిన రమేష్‌గౌడ్‌కు కృష్ణ మండలం తంగిడికి చెందిన భవానితో గురువారం లీపు ఇయర్‌లో బంధువులు, స్నేహితుల మధ్య పెళ్లి చేసుకున్నారు.

మంచి ముహూర్తం ఉండటంతో..


నూతన దంపతులు రాజుచారి, సహస్ర

మక్తల్ మండలం సోమేశ్వర్‌బండలో గురువారం రాజుచారి, సహస్రతో వివాహం ఘనంగా జరిగింది. ఫిబ్రవరి 29న తమ పేర్లపై పెళ్లి ముహూర్తం బాగా ఉండటంతో తేదీన ఇరు పెళ్లి పెద్దలు కలిసి నిర్ణయించుకున్నారు. వధూవరులను హాజరైన బంధువులు, స్నేహితులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

నాలుగేళ్ల సంబరం ఒకే సారి



తమ కుమారుడి జన్మదినం కోలాహలంగా నాలుగేళ్ల సంబరం ఒకేసారి చేసుకుని సంబరపడ్డారు. 2020 ఫిబ్రవరి 29న జన్మించిన నవాబుపేట మండలం హజిలాపూర్ చెందిన అనిరుధ్‌పాటిల్ జన్మదినం గురువారం బంధుమిత్రుల మధ్య పండుగ వాతావరణంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. కుటుంబసభ్యులంతా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎంతో సంతోషంగా ఉంది


జడ్చర్ల ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చిన దీపిక


జడ్చర్ల ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చిన షైనాజ్ బేగం

నాలుగేళ్లోసారి వచ్చే లీపు సంవత్సరం రోజున తమ పిల్లలకు జన్మనివ్వడం సంతోషకరంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. గురువారం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు తల్లులు తమ పిల్లలకు జన్మనిచ్చారు. బాలానగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన దీపిక ఓ బిడ్డకు జన్మనివ్వగా, జడ్చర్లకు చెందిన అజీరా బేగం,షైనాజ్ బేగం తమ బిడ్డలకు జన్మనిచ్చారు. వీరికి ప్రతి లీపు సంవత్సరం రోజున పుట్టినరోజు చేసుకునే అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు తెలిపారు.

లీపు ఇయర్‌లో పుట్టిన పాప


పుట్టిన పాపతో తల్లి గాయత్రి

కల్వకుర్తి మండలంలోని మార్చాలకు చెందిన నాని, గాయత్రిది 2023లో ప్రేమ వివాహం. బుధవారం రోజున పురిటి నొప్పులు రావటంతో ఉదయాన్నే ఆస్పత్రికి తీసుకొచ్చారు. బుధవారం రోజునే డెలివరీ అవుతుందనుకున్నా, చివరకు అర్ధరాత్రి 12.53 గంటలకు పాప పుట్టింది. పాప పుట్టిన తర్వాత ఫిబ్రవరి 29వ తేదీ లీప్ ఇయర్ రోజున పుట్టడంతో మాకు అనుకోకుండా స్పెషల్‌డేగా మారిపోయింది. గతంలో మా అన్న కూతురు కూడా లీప్ ఇయర్ రోజున పుట్టిన విషయం గుర్తుకు వచ్చింది. లీప్ ఇయర్ రోజున మా పాప పుట్టడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఫిబ్రవరి 29వ తేదీ స్పెషల్ డేలో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో ఒక పాప, ఒక బాబు జన్మించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం తెలిపారు.


12 కోట్ల గృహాలకు వంటగ్యాస్


పోలేపల్లి సెజ్‌లో సీఎన్‌జీ గ్యాస్ మదర్ స్టేషన్ ప్రారంభిస్తున్న అంజనీకుమార్ తివారీ

- పీఎన్‌జీఆర్‌బీ సభ్యులు అంజనీకుమార్ తివారీ వెల్లడి
- పోలేపల్లి సెజ్‌లో సీఎన్‌జీ గ్యాస్ మదర్ స్టేషన్ ప్రారంభం

జడ్చర్ల: దేశ వ్యాప్తంగా 12 కోట్ల గృహాలకు పైపులైన్ల ద్వారా వంటగ్యాస్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు సభ్యుడు అంజనీకుమార్ తివారీ వెల్లడించారు. గురువారం పోలేపల్లి సెజ్‌లో సీఎస్‌జీ మదర్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. మొదటి అవసరంగా పోలేపల్లి సెజ్‌లోని ఆసియాన్ సిరామిక్ టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాను అందించారు. అనంతరం బాలానగర్ మండలం బోడజానంపేటలోని గృహాలకు పైపులైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలు, గృహ, వాణిజ్య అవసరాల నిమిత్తం పైపులైన్ ద్వారా నేరుగా సీఎస్‌జీ గ్యాస్‌ను సరఫరా చేసేందుకు వీలుగా పోలేపల్లి సెజ్‌లో మేఘా ఆధ్వర్యంలో సీఎస్‌జీ మదర్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 22 జియోగ్రాఫికల్ ఏరియాల్లో నేచురల్ గ్యాస్‌ను సరఫరా చేస్తూ మేఘా కంపెనీ ముందు వరుసలో ఉండడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా 12 కోట్ల కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఇందులో మేఘా కంపెనీ 1.3 కోట్ల కనెక్షన్లు అందిస్తుందన్నారు. ఇందుకు 17వేలకు పైగా సీఎస్‌జీ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నామని, మొదటగా గ్రామీణ ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఇందుకు 35 వేల కి.మీ.ల మేరకు పైపులైన్లు నిర్మిస్తున్నామన్నారు. మేఘా గ్యాస్ డైరెక్టర్ సీఈఓ పీ వెంకటేశ్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా మహబూబ్‌నగర్ జియోగ్రాఫికల్ ఏరియాలో కాలుష్య రహిత గ్రీన్ ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా నేచురల్ గ్యాస్ సేవలను విస్తరించడంలో భాగంగా ఇప్పటికే మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో మొదటి ఎల్సీఎన్జీ ప్లాంట్‌ను ప్రారంభించామన్నారు. పంజాబ్‌లోని తరంతరన్, తమిళనాడులోని తిరువణ్ణామలై ప్రాంతాలలో సైతం త్వరలోనే ఎల్సీఎన్జీ ప్లాంట్లను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని
తల్లిని కొట్టిచంపిన కుమార్తె


మృతిచెందిన వెంకటమ్మ

అడ్డాకుల: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ కుమార్తె కన్నతల్లిని కొట్టి చంపింది. ఈ సంఘటన భూత్పూర్ మండలం కర్వెనలో చోటుచేసుకుంది. భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాకి వెంకటమ్మ(60) తన కుమార్తె కాకి నారమ్మకు వివాహం చేయగా.. భర్త వదిలేశాడు. అప్పటి నుంచి తల్లి ఇంటి వద్దే ఉంటోంది. నారమ్మ తాగుడుకు బానిసై డబ్బులు ఇవ్వమని తరుచూ తల్లితో గొడవపడేది. ఈ క్రమంలో గురువారం ఉదయం మరోమారు నారమ్మ తన తల్లితో గొడవ పడి, తల్లి తలపై కర్రతో బలంగా కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమవగా.. బంధువులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందిందని సీఐ రామకృష్ణ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులతో కలిసి సీఐ పరిశీలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

జింక అనుమానాస్పద మృతి



నవాబుపేట: మైసమ్మ అడవిలో జింక తీవ్రగాయాలతో మృతిచెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. అటవీశాఖ అధికారి కరుణ జింక మృతదేహాన్ని గురువారం స్వాధీనం చేసుకుని అడవిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం తీవ్ర గాయాలపాలై జింక మృతిచెందిందని వివరించారు. కుక్కల దాడిలోనైనా.. చిరుత సైతం దాడి చేసి ఉండవచ్చనే అనుమానాలు సైతం వచ్చాయని చెప్పారు. అందుకే పోస్టుమార్టం నివేదికను ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు అటవీశాఖ అధికారి వివరించారు. కాగా పోస్టుమార్టం అనంతరం నిర్మానుష్య ప్రాంతంలో జింక కళేబరాన్ని కణనం చేసినట్లు సిబ్బంది తెలియజేశారు.

పట్టుదలతో చదివి.. ఉద్యోగాలు సాధించి...


సంతోషరెడ్డి

చిన్నచింతకుట: పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని పలువురు నిరుద్యోగులు నిరూపించారు. ఒకేసారి రెండు, మూడు, నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నచింతకుంట మండలం దాసర్‌పల్లికి చెందిన పురుషోత్తం, కృష్ణమ్మకు ముగ్గురు కుమార్తెలు. కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తూనే ముగ్గుర్ని చదివించారు. చిన్న కుమార్తె సంతోషరెడ్డి ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించింది. గ్రామంలో ప్రాథమిక విద్య, అప్పంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసింది. గద్వాల జిల్లాలోని కొట్టం మాణిక్యమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఎంపీఎస్‌లో పీజీ, కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేసింది. డిగ్రీ చదువుతుండగానే గ్రామానికి చెందిన రఘురెడ్డితో వివాహం జరిగింది. చదువుపై ఆసక్తిని గుర్తించిన భర్త ఉన్నత చదువులకు సహకరించారు. 2023లో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు పరీక్షలు రాసింది. వారం క్రితం పీజీటీ, టీజీటీ ఫలితాలు, గురువారం జేఎల్ ఫలితాలు వెలువడ్డాయి. మూడు ఉద్యోగాలు ఒకేసారి వరించడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లువెత్తింది. సంతోషరెడ్డిని కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు, మండల నాయకులు అభినందించారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు..


దీపారెడ్డి

మానవపాడు: మండల కేంద్రానికి చెందిన దీపారెడ్డి ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. భర్త పవన్‌కుమార్‌రెడ్డి సహకారంతో చదువుకొని ఉద్యోగాలు సాధించినట్లు ఆమె వివరించారు. పదోతరగతి వరకు కొత్తకోట మండలంలోని విలియంకొండ రావుబహద్దూర్ వెంకట్రామిరెడ్డి మోడల్ స్కూల్‌లో, ఇంటర్మీడియట్ వనపర్తి సీవీ రామన్ కళాశాలలో, హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేసింది. ప్రస్తుతం మియాపూర్‌లో నివాసం ఉంటుంది. ఇటీవల వెలువడిన గురుకుల జూనియర్ లెక్చరర్, గురుకుల పీజీటీ, ఏకలవ్య మోడల్ స్కూల్ టీచర్, గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపక ఉద్యోగాలు సాధించింది.

రెండు ఉద్యోగాలు సాధించిన కౌసల్య


కౌసల్య

అడ్డాకుల: మండల కేంద్రానికి వి.కౌసల్య ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గ్రామానికి చెందిన వన్నం శ్రీహరి, వసంత దంపతుల కుమార్తె కౌసల్య ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి భర్త మల్లేష్ సహకారంతో ఘట్‌కేసర్‌లోని గురుకుల పాఠశాలలో అతిథి అధ్యాపకురాలిగా పని చేస్తోంది. ఉద్యోగం చేస్తూనే జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాల సాధనకు సొంతంగా సిద్ధమై పరీక్షలు రాసింది. బుధవారం వెలువడిన డిగ్రీ లెక్చరర్, గురువారం వెలువడిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికైందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా అంజన్న రథోత్సవం


జాతరలో భక్తుల రద్దీ


హాజరైన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: మండలంలోని అల్వాలపాడు గ్రామ శివారులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని రథంపై ప్రతిష్టించి పూజలు చేశారు. రాత్రి 7 గంటలకు ఆంజనేయ నామస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. ఉదయం ఆలయంలో స్వామి వారి అలంకరణ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు చేశారు. జిల్లాలోని నలుమూలలతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చారు. దాసంగాలు స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే పూజలు

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వివరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జెడ్పీటీసీ పద్మావెంకటశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ శ్రీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్ఐసీ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ జీ వేణుగోపాల్, మాజీ సర్పంచులు ప్రతాప్, తుమ్మల బావి ఆంజనేయులు, వీరన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోటీ పరీక్షలపై పీయూలో అవగాహన


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిన నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా రియాజ్ హాజరవుతున్నట్లు తెలిపారు. గ్రూప్–1, 2 డీఎస్సీ పరీక్షలపై సమగ్రమైన అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ భూమయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేతగా ఖమ్మం



విజేతగా నిలిచిన ఖమ్మం జట్టుతో అధికారులు, నిర్వాహకులు

జడ్చర్ల: స్థానిక స్టేడియం ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌లో ఖమ్మం జట్టు విజేతగా నిలిచింది. సెమీస్‌లో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు తలపడగా ఖమ్మం విజయం సాధించింది. అదేవిధంగా రంగారెడ్డి, హైదరాబాద్ జట్లు తలపడగా.. రంగారెడ్డి గెలిచి ఫైనల్‌కు చేరింది. ఫైనల్స్‌లో ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల జట్లు తలపడగా 36 పరుగుల తేడాతో ఖమ్మం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదటగా బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జట్టు 15 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. ఈ జట్టులో అత్యధికంగా కార్తీక్ 47 పరుగులు, సుకేష్ 22 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి జిల్లా జట్టు 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 86 పరుగులకే పరిమితమైంది. అదేవిధంగా సెమీస్‌లో ఓడిన హైదరాబాద్, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచి మూడో స్థానం దక్కించుకుంది. ఆయా జట్ల నుంచి రాష్ట్ర స్థాయికి వివిధ జిల్లాలకు చెందిన 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి క్రికెట్ పోటీలను ప్రారంభించగా.. విజేతలకు స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రమేశ్‌బాబు, నిరంజన్, సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజర్స్ మోయిన్, కిట్టు, తదితరులు పాల్గొని బహుమతులు అందజేశారు.


మూడో స్థానం పొందిన మహబూబ్‌నగర్ జట్టు